# మా య మ న సు

గుడ్డివెన్నెల కిటికీలోనుంచి గదిలో పడుతున్నది. దూరాన టపాకాయలు మోగుతున్నాయి. ఉలిక్కిపడిలేచిన లలిత బద్ధకంగా పక్కకు తిరిగింది. వరండాలోనుంచి సన్నగా మాటలు వినవస్తున్నాయి.

"సాయంత్రమనగా పడుకున్నారు. ఇంకా నిద్రలోనే ఉన్నట్టుంది, లేపమంటారా?"

"వద్దులే, రేపు మళ్ళీ వస్తానుగా? మందులూ అవీ వేళకి యిస్తున్నారా?"

"ఊఁ!"

"పెద్ద డాక్టరు రోజూ వచ్చి పోతున్నారుగదా? పూర్తిగా తగ్గిందనుకుంటాను."

"చాలావరకు తగ్గినట్లేనండి."

"పళ్లూ అవీ, బాగా తీసుకుంటూనే ఉందిగా?"

"తీసుకుంటున్నారు, లేచారేమో చూసివస్తాను."

"వద్దులే, నువ్వు వెళ్ళితే ఆ సవ్వడికి మెలకువవస్తుందేమో?"

"మిమ్మల్ని దించి రమ్మంటారా, దూరం వెళ్ళాలేమో?"

"నాకు యింకా పనివుంది. లలిత మధ్యలో లేచి ఏమయినా అవసరం అయితే యిబ్బందిగదా? అయినా నేను ఎప్పుడు వెడతానో నాకే తెలియదు."

కాస్సేపు నిశ్శబ్దం. "మరి నేను వస్తాను. ఏమయినా అవసరంపడుతుందేమో? రేపు వస్తానని చెప్పు."

మెత్తగా అడుగులు పడిన చప్పుడు. లలిత తలయెత్తి చూసింది. అప్పటకే అతను వెళ్ళిపోయాడు. డ్రైవరు లోపలికి వచ్చాడు. "మీరు లేచారా, భాస్కరంగారు వచ్చారు. మీరు లేస్తారేమోనని చూచి యిప్పుడే వెళ్ళారు, పిలవమంటారా?" అని గుమ్మంవేపు అడుగు వేయబోయాడు. "వద్దు వద్దు!" ఆత్రతగా అని వెంటనే సిగ్గుపడిపోయింది లలిత. ఆశ్చర్యంగా ముఖంపెట్టి నిలబడిపోయాడు డ్రైవరు. "పొద్దుపోయింది. ఆయనకోసం యింటివద్ద కనిపెట్టుకుని ఉంటారు." తన పనిని సమర్థించుకొంటున్నట్టు గొణిగింది లలిత.

అన్నీ అందుబాటులో ఉండేటట్టు అమర్చి, లలిత చెప్పిన మీదట కారులో పడుకోవటానికి వెళ్ళిపోయాడు అతను. ఎండిన అతని జుట్టు తెల్లగా మెరిసింది లైటువెలుతుర్లో. నాన్న చిన్నప్పటినుంచీ పనిచేస్తున్నాడట తమ వద్ద, పాతరోజులు మనిషి.

నర్సు వచ్చి మందుయిచ్చి వెళ్ళిపోయింది. నిద్రరావడంలేదు, ఏమీ తోచడంలేదు. ఎవరయినా దగ్గరవుండి కబుర్లు చెబుతే బాగుండును!

స్టూలుమీద చంద్రంబావ దగ్గరనుంచివచ్చిన ఉత్తరం పడివుంది. అదివచ్చి నాలుగురోజులవుతున్నది. ఇంకా తెరిచి చూడలేదు. అది తియ్యాలంటేనే విసుగనిపిస్తుంది. అందులో చూడటానికేముంటుంది? తన గొడవలుతప్ప, ఎదుటివాళ్ళ కష్టం అర్థంకాని ఆ మనిషి ఏమి వ్రాస్తాడు? అందుకే తనకు ఇంకా దాని మొహం చూడబుద్ధి కావటంలేదు.

"అయినా నేను యిక్కడ వుండిమాత్రం చేసేదేముంది? డాక్టరుతో మాట్లాడాను. ఇంకో నెలరోజులలో డిశ్చార్జి చేస్తారుట! నువ్వు ఆలోచనలుమాని కులాసాగా వుండాలి" అన్నారు చంద్రంబావ. అతని మొహంలో విసుగుదల తను అర్థంచేసుకోగలిగింది. నాన్న గనక ఉండివుంటే బావ యిలా అనగలిగి ఉండేవాడేనా? ఆయనను చూడగానే తన కెంతో సంతోషమయింది. కనీసం ఒక పదిరోజులయినా ఉంటారుగదా అని ఆశపడింది. చేతిలో డబ్బుందిగనుక అన్నీ అమరుతున్నాయి. కానీ, తన చుట్టూ యింతమంది జనం తిరుగుతున్నా, తనకు ఒంటరితనం అనిపిస్తుంది. భయంతో తను బాధపడుతున్నది. చంద్రంబావ నాలుగురోజులుండి, డాక్టరుతో మాట్లాడి ఏర్పాటుచేస్తే తనకెంతో బలంగాఉంటుంది. ఆ సంగతి చెబుదామనుకుంటుండగానే అంతా తనే నిర్ణయించేశాడు.

"ఊటీ వెళ్ళాలని మీ అక్క నెలరోజులనుంచీ ప్రియత్నించేస్తున్నది ఆవిడకు ఈ ఎండలు భరించలేనంత బాధ కలిగిస్తున్నాయట. బయల్దేరుదామనుకుంటూ ఉండగానే భాస్కరం వ్రాసిన ఉత్తరం అందింది. అప్పుడే తెలిసింది — నువ్వు యిక్కడ ఉంటున్నట్టు.

"పాపం, చిన్న వయస్సులోనే నీకీ జబ్బు ఏమిటని వాళ్ళూ బాధపడ్డారు. వాళ్ళనటు పంపించి నేను యిటు వచ్చాను. వాళ్ళంతా మద్రాసులో నాకోసం ఎదురుచూస్తూ ఉంటారు.

"ఈ ఉద్దేశాలలో పడి ఇద్దరం చెరొక దారీ అయిపోయాము.

"అందుకే భాస్కరానికి వ్రాశాను—'ఇల్లా బయలుదేరుతున్నాము. అందరం కలిసి కొన్నాళ్ళు గడిపిరావచ్చు. మీరు కూడా రావలసింది'—అంటారు. కాని, సమాధానమే లేదు. ఆ విషయమే ఇందాక ఆఫీసులో అడిగితే నవ్వి ఊరుకున్నాడు. వాడెప్పుడూ అంతే. తనకిష్టం లేకపోతే ఒకళ్ళమాటని అంతగా పట్టించుకోరు. తన మనసులోని మాటని అంతత్వరగా బయట పడనీయడు."

తనకు విసుగేసింది. "నేను వ్రాసిన ఉత్తరం అంద లేదా, బావా?" అని ఆ ప్రవాహాన్ని మధ్యలో ఆపివేసింది. బావ కొద్దిగా ఆశ్చర్యపడ్డాడు. "అందలేదే! ఆ మధ్యన క్యాంపుకు వెళ్ళాను. ఒకవేళ పిల్లలు ఎక్కడయినా పడేశారేమో?" అన్నాడు.

"భాస్కరం చూశావా? వాడు చిన్నప్పుడు ఎంతబాగా ఉండేవాడు. పాపం, బాగా చిక్కిపోయాడు. చంపలు అవీ లోపలికి పోయాయి. 'ఏమిరా?' అంటే యేమీలేదని అంటాడు. మా మరదలు నడుగుదామా అంటే ఇంటికి వెళ్ళటానికే టైములేకపోయింది."

ఎంతసేపూ తనగొడవా, పిల్లలగొడవా. తమ్ముడి గొడవా తప్ప ఈ మనిషికి ఇంక ఏమీ పట్టవా? ఇన్నిరోజుల నుంచి హాస్పిటల్‌లో ఉండి జబ్బుతో తీసుకుంటూవున్న తన దగ్గరకు ఈమనిషి ఎందుకు వచ్చినట్టు? సొంతగొడవలు చెప్పి మరింత చికాకు కలిగించటానికా? ఏమి మనుషులు! ఇన్నాళ్ళ నుంచి దిక్కులేనట్టు ఇక్కడ పడివుండి తీసుకుంటున్న తనకు ఒక ఓదార్పుమాట లేదుగాని తమ్ముడు భాస్కరం కొద్దిగా చిక్కాడని ఎంతగానో అయిపోతున్నాడీమనిషి.

అవును. కడుపులోలేనిది కావలించుకుంటేమాత్రం యెక్కణ్నించి వస్తుంది ?

"నువ్వు ధైర్యంగా ఉండాలి. భాస్కరం చూసి పోతుంటారులే. మరి నాకు టైమయింది. వెళ్ళిరానా ?" అన్నాడు చంద్రంబావ. నోరు పెగలక తల ఆడించిందితను. పంచఅంచుల్ని సుతారంగా చేత్తోపట్టుకొని నడిచి వెళ్ళాడతడు.

ఈ మనిషేనా, తాను పెద్ద దిక్కుగా భావించి సహాయపడతాడని ఆశించింది? తన అసహాయతకు జాలిపడి అసహ్యించుకుంది ఇంకేమీ చెయ్యలేక. తనసంగతి యెవరికి

పడుతుంది? తని కన్నీరు యెవరిహృదయం కరిగిస్తుంది ? నా అనేవాళ్ళు యెవరున్నారు తనకు ?

తను ఎవరికికావాలి? గుండెల్లోదిగులు క్రుంగదీస్తుంటే జాలిపడి నిద్రాదేవి తనను ఒడిలోనికి తీసుకుంది.

మధ్యాహ్నం మూడుగంటలకు నిద్రలేచింది తను. యెదురుగా స్టూలుమీద కూర్చుని బత్తాయిపండు ఒలుస్తున్నాడు భాస్కరం. "బాగా నిద్రపోయినట్లుంది కళ్ళు ఎర్రగా ఆయినవి" అన్నాడు నవ్వుతూ. అతనినవ్వు ముల్లుగుచ్చినట్లుంది తనకు. లేచి మొహం కడుక్కొనివచ్చేసరికి ప్లాస్కులో కాఫీవంచి గ్లాసు అందించాడు. తీసుకోక తప్పలేదు తనకు.

ఇతను ఏమి మొండిమనిషి? అతను ఇక్కడికి రావడం తనకిష్టంలేదని యెలా తెలియచెయ్యటం? ఇతనికి తనమీద ఏమీ కోపంలేదా? అతనిమీద తనకు ద్వేషం ఉందని గ్రహించలేదా?

"అన్నయ్య మధ్యాహ్నం బండికి వెళ్ళిపోయేడు. సెలవుపెట్టి రైలెక్కించి వచ్చాను. 'నువ్వు బాగా చిక్కిపోయా' వంటున్నాడు" అన్నాడు. మౌనంగా ఉండిపోయింది.

"పండుగనాటికి నిన్ను డిశ్చార్జి చేస్తారట! అప్పుడు బాధ తగ్గిపోతుందిగదా పూర్తిగా?" అన్నాడు. తలవూపింది తను.

"పాపం మధ్యాహ్నంపూట సెలవు అవటం బాగానే ఉంది. నీకూ తోస్తూనేవుందిగా?" అన్నాడు. తలవూపింది తను.

తన మనసులోవున్న బాధంతా వెళ్ళగక్కి 'దీనికంతా నువ్వే కారణ' మని అతన్ని నిందించాలని అనిపిస్తుంది. తన ద్వేషమంతా బయటపెట్టి, 'నువ్వు ఇక నాదగ్గరకు రానవసరంలేదు'అని చెప్పేయాలనిపిస్తుంది. 'నీవు బాగానే ఉన్నావుగాదా? ఇంక నావెంట ఎందుకుపడతావు? నన్ను నా మానానికి ఎందుకు వదిలిపెట్టవు?' అని అడిగేయాలని అనుకుంటుంది.

కాని భాస్కరాన్ని చూడగానే తన మనస్సు నాగస్వరంవిని చేతలుడిగిన పామువలె అయిపోతుంది. అతనిముందు తను నిస్సహాయ అయిపోతుంది. బహుశా తన ఈ బలహీనతనే ఆధారంగా చేసుకుని భాస్కరం తనకన్యాయం చేశాడా?

అతన్ని వదిలించుకునేదారి లేదా? అతన్ని రమ్మని ఎవరు అడిగారసలు? అతను కాస్సేపుకూర్చున్నాడుమౌనంగా. తను ఇన్నాళ్ళనుంచి గమనించలేదుగాని భాస్కరంబావ నిజంగానే చిక్కిపోయాడు. కళ్ళు లోతుకుపోయి చుట్టూ నల్లనిగీతలు ఏర్పడ్డాయి. చెంపలు లోనికి తోసుకునిపోయాయి. వంకీలు తిరిగివున్న నల్లటిజుట్టులో అక్కడక్కడ తెల్లవెంట్రుకలు తొంగిచూస్తున్నాయి. చంద్రంబాబు అన్నమాటనిజమే.

"ఏమయినా అవసరంపడితే డ్రైవర్ని ఇంటికి పంపించు" అని వెళ్ళిపోయాడు బావ. అతను నడుస్తూంటే నీరసంగా ఉన్నట్టనిపించింది తనకు పాపం!

"నువ్వు చూడలేదేమో? భాస్కరంవచ్చాడు ఒక్కడే. వాడిమీద మామూలు ఆప్యాయత చూపలేకపోయాను.

వెళ్ళేటప్పుడు చెప్పటానికి వచ్చాడు. నేను మాట్లాడలేదు. చిన్నబుచ్చుకున్నాడేమో” అన్నారు నాన్న. ‘నేను ఊళ్ళు తిరుగుతున్నాను అందువలన లలిత పెళ్ళిసంగతి తెలియలేదు. బెజవాడలో అన్నయ్య కనిపించి చెప్పాడు. అటునుంచి ఇటే వచ్చాను’ అన్నాడు భాస్కరం. కాని వాడికేం తెలుసు మనం కావాలనేవాడికి తెలియనివ్వలేదని” బాధపడ్డాడు నాన్న.

“పోనీలే నాన్నా! ఎవరికెవరు? మనం బాధపడినప్పుడు ఎవరికిపట్టింది?” అంది తను ఆ విషయాన్ని అక్కడితో తుంచి వేస్తూ. కాని అతను తనచేత ఇంకా గట్టిగా అవమానింపబడ్డాడని ఆయనకేమి తెలుసు? పిచ్చినాన్న! మేనల్లుడిమీద ఇంకా మమత చంపుకోలేక బాధపడుతున్నాడు.

వైభవోపేతంగా జరిగిపోయింది తనపెళ్ళి. కావాలని పంతంకొద్దీ వెతికి, భాస్కరం తలదన్నిన సంబంధం తెచ్చి హట్టహాసంగా చేశాడు నాన్న.

ఆ సాయంత్రం తను ఒక్కర్తీ గదిలో కూర్చుని వున్నది. వయస్సు మళ్ళిన బంధువు ఒకావిడ వచ్చిచెప్పింది — “భాస్కరం వెడుతున్నాడట. నీతో చెప్పటానికి వచ్చాడు” అని. తనకు విసుగేసింది. భాస్కరం వచ్చాడన్న మాట! అంతా చూసి యీర్ష్యతో కుళ్ళిపోతూ వుండి ఉండాలి. అయినా యెందుకు వచ్చాడు తను? ఎవరు పిలిచారు? అని మండిపడింది లోలోపలే. తలుపు కిందనుంచి అతని పాదాలు కనబడుతున్నాయి. అతను వినాలనే గట్టిగా, కసిగా అంది— “వెడుతున్నాడా? పోనీలే. నాకు యిప్పుడు బాగా అలసటగా వుంది. నిద్రపోతున్నానని చెబుదూ! అంత చెప్పాల్సిం

దేమిటి" అని ఆవిడ ఆశ్చర్యంగా కాసేపు చూసి. తరవాత బయటికి వెళ్ళిపోయింది. అవమానించబడిన అతని పాలిపోయిన మొహంచూసి ఆనందించాలనే చిత్రమయిన కోరిక కలిగి కిటికీ సందులలోనుంచి చూసింది తను. కాని మొహం కనబడలేదు. వెళ్ళిపోతున్న అతని వీపు, వెనుకభాగంమాత్రం కనిపించాయి. అతను వెళ్ళిపోయాడు. ఆ నాడు అంత అవమానం పొందినా ఆ మనిషికి తనమీద కోపం రాలేదా? చిత్రమయిన మనిషి! అవును. చిత్రంగానే తనకు అన్యాయం చేశాడు. నమ్మించి ద్రోహం చేశాడు.

ఒకనాడు యిదే మనిషి ఒంటరిగా తనను పట్టుకొని, చుట్టూ చేతులేసి, "లలితా! నువ్వు లేకపోతే నేను బ్రతకలేను. నిన్ను నాలో కలిపేసుకోవాలనిపిస్తూ వుంది. నేనింకా యిలా యెంతకాలం ఆగాలి? దొంగా! నన్నెందుకేడిపిస్తావు?" అన్నాడు దీనంగా. తను జాలిపడి అతను ఉంగరాల జుట్టు నిమిరింది. 'నా పిచ్చిబావా! నీది ఎంత మంచి మనస్సు!" అనుకుని ఆనంద పడింది.

తనకు కలల్లో కనిపించి యెంతో అల్లరి చేసేవాడు. కాలేజినుంచి పెద్ద పెద్ద ఉత్తరాలు వ్రాస్తూ ఉండేవాడు. అది ఎంతో ఆనందంగా ఉండేది మనస్సును మధురలోకానికి నడిపించుకుని వెళ్ళేవి. బావమనసు కూడా అందమయినదే అనిపించింది తనకు. మనిషి రూపమే అతని జీవిత సాహచర్యాన్ని వూహించుకుని తను గాలిమేడపై ఆనందపు హద్దులు వరకూ వెళ్ళింది.

"అయిన సంబంధము. ఇద్దరూ ఇష్టపడ్డారు. ఈడూ జోడూ బాగా కుదిరింది. పై యేడాదికి వాడిచదువు అయిపోతుంది. ఆ మూడుముళ్లూ వేయించి అంతా వాళ్ళ కప్పగించేసి నిశ్చింతగా కాలక్షేపం చేస్తాను" అనేవారు తెలిసిన వాళ్ళతో నాన్నగారు.

కన్నెమనసుతో దోబూచులాడే ఆలోచనలతో ఉక్కిరిబిక్కిరి అయ్యేది తను. భాస్కరంబావతో తనపెళ్ళి అవుతుందని అనుకున్నారు అంతా. అంతా నిశ్చయమైనట్లే. ఎదురుచూస్తూవున్న ఆ ఏడాదీ ఇట్టే గడిచిపోయింది. నిరీక్షణల పొలిమేరలు దాటిపోయింది తను.

"భాస్కరం బావ ఉత్తరం వ్రాశాడమ్మా! సెలవులిచ్చారట!" అన్నారు నాన్న ఒకసారి. తన మనస్సు ఆనందంతో పొంగిపోయింది; 'అయితే బావవస్తున్నాడన్నమాట' అనుకుని.

"పాపం! తులసమ్మ తెలుసుగా? ఆవిడ పోయిందట! నువ్వెప్పుడో చిన్నప్పుడు చూసి వుంటావు. మీ మామయ్యా వాళ్ళ తండ్రీ అన్నదమ్ములు. వాళ్ళాయన దుర్వ్యసనాలకు మరిగి ఆస్తిని నాశనంచేసిపోయాడు. విశాల అని—నీవయసే వుంటుంది. ఒక్కతే కూతురు. అదీ, సరిగా వుండక ఈమధ్యన మెట్లమీదినుంచి జారిపడి కాలు విరగగొట్టుకుందట. 'ముందు అక్కడ దిగుతున్నాను. తరువాత ఒక వారం రోజుల్లో వస్తా'నని వ్రాశాడు."

"పోనీలే. వారం ఆగలేనా, ఇంతకాలమూ ఆగిన

దాన్ని" అనుకుంది తను. కాని, హృదయం ఎంతో ఆరాట పడింది. తను యెదురుచూస్తూ ఉన్న ఘడియ రానేవచ్చింది చివరికి. రిక్షాదిగి లోపలికి వచ్చిన తను ఆనాడు, హాల్లో నాన్నగారు, భాస్కరంబావ కూర్చునిఉండటం గమనించి, తొట్రుపడి లోపలికి పరుగెత్తబోయింది. నాన్నగారు పిలవడంతో సిగ్గు పడుతూ దగ్గరికెళ్ళి నిలబడింది.

నాన్న మొహం యెర్రగా కంది వుంది. కళ్ళు యెర్రగా ఉన్నాయి. కొంటెగా, తన మొహంలోనికి చూడవలసినబావ గంభీరంగా పైకి చూస్తున్నాడు. పలకరింపూ లేదు.

"ఆ విషయం లలితకి చెప్పి, మరి నేను వెడతాను, మామయ్యా!" అన్నాడు బావ చివరికి. నాన్నగారు తలఊపి నిశ్శబ్దంగా తన గదిలోనికి వెళ్ళిపోయేరు. ఏమిటి ఈ మనిషి తనకు ఒంటరిగా చెప్పే విషయం? తను సిగ్గుతో కుంచించుకు పోయింది. కాని, మరుక్షణం అతను చెప్పిన విషయం విని, నిశ్చేష్టఅయిపోయి దీనంగా చూస్తూ నుంచుంది. కన్నీరు బుగ్గల్ని తడిపి వేసింది.

"లలితా! అలా జరిగిపోయింది. ఇది కేవలం విశాల మీద జాలివలన జరిగింది. ఆ సంగతి నేను చెప్పుకోకూడదు గాని నీకు చెప్పక తప్పదు. ఇందులో నిన్ను మోసం చెయ్యాలనే ఉద్దేశ్యం యే మాత్రమూ లేదు. ఆ క్షణంవరకూ అలా అవుతుందని నాకే తెలియదు.

బాగా ఆలోచించిన మీదటనే యిది జరిగింది. నేను దేనికోసం యిలా చేశానో, స్థిమితంగా ఆలోచిస్తే నీకూ

బోధపడుతుంది. నేను విశాలని పెళ్ళి చేసుకున్నాను!" అన్నాడు.

ప్రేమతో పెంచుకున్న తన మొక్కను పీకివేసి, ఇది ఉంటే పాపం ఆ చిన్న మొక్క చనిపోతుంది. ఇది లేక పోయినా ఫరవాలేదు. 'దాన్ని పెరగనీయి' అని హితవు చెప్పి నట్లయింది.

భాస్కరం యింత పిచ్చిపని చేస్తాడని తను కలలో కూడా అనుకోలేదు. పైగా, 'కావాలంటే నీకు నాకన్నమంచి భర్త లభిస్తాడు. కాని విశాల పరిస్థితి వేరు. ప్రయత్నిస్తే దన్ను మరిచిపోగలవు. నన్ను క్షమించు. లలితా!' అన్నాడు ఎంత తేలికగా అనగలిగాడు!

అయితే తనుకట్టుకున్న మేడలన్నీ కూలిపోయినట్లేనా? ఇంత మోసం చెయ్యటానికి భాస్కరం మనసెలా ఒప్పింది? ఇతని మొహం చూడటానికి యిష్టంలేక లోపలికి వెళ్ళి పోయింది తను.

"తల్లీ తండ్రీ లేరు. వెనుక ఆ స్తిపాస్తులు లేవు. పైగా కుంటిపిల్ల. ఏమి చూసి నువ్వు లలితని కాదని విశాలని చేసు కున్నావు?" అని అడిగాడట నాన్న.

" 'అవును. ఆ పిల్ల సంగతి ఏమిటి? ఎవరు చేరదీస్తారు? అనిపించింది నాకూను — గుండెలు పగిలేలా ఏడుస్తున్న విశాలను చూసి. కనుకనే అలా జరిగింది" అన్నాడట!

మనసారా నమ్మినందుకు ప్రతిగా ఆ మనిషి తనలో అన్ని ఆశలు రేపి ఆఖరికి నిరాశ చేసి, ఏమీ జరుగనట్లు నటించి, బాధపడవద్దని హితవుపలికి వెళ్ళిపోయాడు. ఏమిమనిషి! అప్పటినుండీ ఆపేరు చెపితే తన నరనరాల్లోని రక్తం గడ్డకట్టు తుంది. ద్వేషంతో హృదయం మండిపోతుంది. మనసు అస హ్యంతో నిండిపోతుంది.

ఆతరువాత ఏడాది తిరగకుండానే, ప తంకొద్దీ వెతికి, కావాలని భాస్కరం తలదన్నిన సంబంధం తెచ్చి వైభవంగా తనపెళ్ళి జరిపించాడు నాన్న. పిలవకనే ఆ పెళ్ళికివచ్చిన భాస్కరానికి అంతకంటె ఎక్కువమర్యాద జరగలేదు. అతనికి జరిగిన అవమానానికి, గాయపడిన తన మనస్సు తృప్తిపడింది.

కాని సంవత్సరం తిరగకుండానే తను భయంకర విషా దంలో మునిగిపోవలసి ఉంటుందని కలలోనైనా అనుకోలేదు ఆనాడు.

తాళిగట్టిన మనిషితో ముచ్చటగా మూడురోజులైనా కాపురం చెయ్యలేదు. ఏకాంతంలో ఒక్క రహస్యమూ నివే దించనేలేదు.

ఒక భయానకమైనరాత్రి, వారు గుండెఆగి మరణించా రని కబురు తెలిసింది. అంతమనిషీ నాన్న నీళ్లుకారిపోయారు. ఏడ్చి, తనగుండె బండబారిపోయింది. తన నూరేళ్ళ పసుపు కుంకుమలు ఏడాదికే చెల్లిపోయాయి. అంత చిన్నవయస్సు లోనే గుండెఆగి మరణించడమేమిటని అందరూ ఆశ్చర్య పోయారు. నమ్మలేనివిషయాన్ని కళ్ళారాచూస్తూ నమ్మక తప్పలేదు అంతా అయిపోయింది.

తిరిగివచ్చిన తరువాత నాన్న పూర్తిగా మారి పోయారు. "మనకి సరిగా తెలీదు. వాళ్ళ ఆస్తినీ, హంగునీ చూసి మోసపోయా . అతను అప్పటికే పూర్తిగా చెడి పోయేడట. తాగుడికి అలవాటుపడి, అధికంగా గుండె, ఊపిరితిత్తులు చెడిపోయాయట. పెళ్ళిచేస్తే నైనా దారికివస్తా డేమోనని మనల్ని నమ్మించి ఈపెళ్ళి జరిపించారట. ఈ విషయాలు మొన్న తెలిశాయి. నీకు అన్యాయం జరిగింది తల్లీ" అని వాపోయారు నాన్న.

అటువంటి మనిషా తనభర్త. అతనితో నేనా తను తన కాపురాన్ని కోరికలగూడు కట్టుకున్నది !

"భాస్కరం తెలిసి నీకు అన్యాయంచేశాడు. నేను తెలియక నిన్ను గంగలో దింపాను" అని కన్నీళ్లు పెట్టుకుని జాలిగాచూసేవారు నాన్న. ఆ బాధలోనే మంచంపట్టి తన కున్న ఆ ఒక్క ఆధారాన్ని తెంచివేసి తనదారితను చూచు కున్నారు నాన్న. కన్నతల్లి చిన్నప్పుడే పోయింది. తెలిసిన వాళ్ళు మోసంచేశారు. తండ్రి అర్ధాంతరంగా పోయాడు. తను అనాధ అయింది.

పాతికేళ్ళకే తనజీవితం ఎండిన మ్రోడయిపోయింది. చంద్రంబావావాళ్ళూ వచ్చారు. తననుచూసి పరిహసించ టానికి భాస్కరంకూడా వచ్చాడు. కాని ఎవరు ఏమనుకుంటే తనకేమి ? తనుకష్టాలలో మునిగివుంది. మనసు మొద్దుబారి గుండె బండలాగు అయింది. నిండా మునిగిఉన్నదానికి చలే మిటి ? దగ్గరకువచ్చి, ఏమీ మాట్లాడలేకపోయాడు.

భాస్కరం కాస్సేపువరకూ "ఇంత ఘోరం జరుగుతుందని కలలోకూడా అనుకోలేదు. లలితా" అన్నాడు గద్గదకంఠంతో నోరు పెగల్చుకొని

"ఇదంతా నువ్వు చేసిందేగా? నీకోరిక తీరిందనుకుంటాను. ఇంకా నేను ఏమయిపోతే నీకు ఇష్టమో చెప్పు" అని బిగ్గరగా ఏడవాలనిపించింది. చాచి మొహంమీద కొట్టాలనిపించింది.

ఎంతో అన్యాయం జరిగిపోయింది. చిన్నవయసులోనే ఇంత ఘోరం జరగడం పెద్ద కష్టమే, ధైర్యంగావుండు, జరిగిపోయినదాన్ని గురించి ఆలోచిస్తూ మనసు చెడగొట్టుకోకు" అన్నాడు.

"మనసు చెడగొట్టుకుంటేమాత్రం పోయిందేముంది బావా!" అన్నది తను. తనవంక ఆశ్చర్యంగా, జాలిగా చూశాడు. పంచదారపూసి మాటలుచెప్పటం ఎంత తేలిక ఇతనికి.

ఇప్పుడు తనకు యేఆశాలేదు. యేబాధాలేదు. తండ్రి మిగిల్చిపోయిన ఆ స్థితిచిన్నది. అప్పుడప్పుడు కష్టం అనిపించినా, బాదరబందీలేని తనజీవితం అనుకున్నంత నికృష్టంగాలేదు.

అటువంటి తనను చూసి ఎంతో ఆప్యాయతతో వచ్చింది ఈరోగం.

వద్దన్నకొద్దీ బలవంతాన తీసుకొనివచ్చి చేర్పించారు నాన్న స్నేహితు డొకాయన. పాపం, ఆవయసులోకూడా ఎంతో ఓర్పుతో అందర్నీ కలుసుకొని హాస్పిటల్‌లో స్పెషల్

వార్డులో చేర్పించారాయన. ఇంతలోనే భార్యకు జబ్బుగా ఉందని తెలియటంతో ఆయన వెళ్ళిపోక తప్పలేదు ఆయన ఎంతో బాధపడుతూ వెళ్ళిపోయారు. ఎవరిగొడవలు వాళ్ళకు మునిచివేస్తున్న ఈరోజులలో ఎవరుమాత్రం యెన్నాళ్ళని వుంటారు తనను కనిపెట్టుకుని?

మళ్ళీ తనూ ఒంటరితనమూను. నాన్నగారికాలంనుంచీ కనిపెట్టుకునివుంటున్న డ్రైవరు రాఘవులే ఆసరాగా నిలిచాడు. ఒకసారి వచ్చిపొమ్మని చంద్రంబావకుమాత్రం ఉత్తరం వ్రాసింది. ఆ పరిస్థితుల్లో ఒకనాడు హఠాత్తుగా నడవ దగ్గరకువచ్చి ఆశ్చర్యపడిపోయేడు భాస్కరంబావ. ఈస్థితిలో తిరిగి భాస్కరం కంటబడడం తనకు ఎంతమాత్రం ఇష్టలేదు. కాని అదే జరిగింది. 'లలితా, నువ్వు ఇక్కడ ఎందుకున్నావు' అన్నాడు.

ఏమని చెబుతుంది తను?

"నాకు నెలరోజులక్రితమే ఈఊరు ట్రాన్సుఫరయింది ప్రస్తుతం ఇక్కడే ఉంటున్నాము. ఇప్పుడు వేరేపనిమీద స్నేహితులదగ్గరికి వచ్చాను. దూరానచూసి నువ్వోకాదో అని సందేహపడ్డాను. ఆఅనుమానంతోనే దగ్గరికివచ్చిచూస్తే నువ్వేను. ఎవరికీ చెప్పాపెట్టకుండా ఎందుకు చేరావు? మాట మాత్రం తెలిస్తే నేను దగ్గరఉండి చూసేవాడినిగదా!" అన్నాడు.

డాక్టరు నడిగి, తనే విషయం తెలుసుకున్నాడు. రోజూ వచ్చి పోతున్నాడు, తీరిక చేసుకుని.

నువ్వు రావడం నాకు యిష్టం లేదు. నా ప్రాణానికి నన్ను వదిలిపెట్టు! ఇంతవరకూ చేసిన సహాయానికి కృతజ్ఞురాలిని' అనాలనిపిస్తుంది, అతనితో. కాని, అలా అనటానికి నోరు రావటం లేదు. అందరూ కఠినంగా వుండలేరు గదా? అంత మంచివాడనుకున్న చంద్రం బావే, కష్ట సమయంలో నాలుగురోజులు వుండి ఆదుకోలేకపోయాడు. ఇక్కడ తను హాస్పిటల్‌లో బాధపడుతూ వుంటే, తన వూటీ ప్రయాణం వాయిదా వేసుకోలేకపోయాడు. ఎవరి కష్టసుఖాలు వారివి. ఎవరి దారి వారిది. బాధపడి ప్రయోజనం ఏమిటి? అటువంటిది, తన జీవితానికే వెన్నుపోటు పొడిచి, బ్రతుకు మోడు చేసిన భాస్కరం తనను ఏమి ఉద్ధరించేటట్టు? అతను రావడం వలన గతస్మృతులు రేపి, మరింత బాధ కలగ చెయ్యడం తప్ప ప్రయోజనం ఏమిటి?

ఊర్మిళ నిజంగా మంచిపిల్ల! అమాయకత నిండిన ఆ పాప మాటలు మంచితనానికి మూటలు. అలాంటి పాపకు భాస్కరం తండ్రిగా తగడు! ఒకనాడు దిక్కులేని దనుకున్న విశాల ఈనాడు యే స్థితిలో వున్నది? తను అక్కడ ఉంటున్నదని తెలిసి ఒకసారయినా చూడటానికి రాలేదు. ఏం? ఎందుకు రావాలి? భాస్కరం గనుక యిన్ని జరిగినా, తనకు తనకు యెంత వద్దని అనిపించినా తన దగ్గరికి పోతున్నాడు. రావద్దని నోరువిప్పి చెప్పినా వినేలాగు లేదు.

భాస్కరం పిచ్చివాడు. ఆమనిషి నేనా తను అంతగా

అవమానించింది? అయినా అతను అదేమీ పట్టించుకోడేమి అతన్ని ఏమని అర్థం చేసుకోగలదు తను?

విశాల నిజంగా అదృష్టవంతురాలు!

"పిన్నీ! ఎందుకు దిగులుగా ఉంటావు? సంతోషంగా వుంటే త్వరగా నయమయితే మా యింటికి వెళ్ళిపోదాము. నీకు యిష్టమేనా?" అని అడుగుతుంది ఆ యింటికి వెళ్ళే గీతే తనకు వుంటే, అది యెప్పుడో జరిగిఉండేది. ఊర్మిళ తనపాపే అయి వుండవలసింది. ఈనాడు దిక్కులేనట్టు యిలా హాస్పిటల్లో పడి ఉండేదికాదు తను. పాపంది, పసి, దానికేం తెలుసు?

అవును. తను దిక్కులేనిది. నా అన్నవాళ్ళు యెవరూ లేరు. తనకోసం బాధపడి రెండు కన్నీటిబొట్లు విడిచే ఆప్తులు లేరు. తనస్థితిని గమనించే, భాస్కరం యింలు తనను వదల కుండా వెంటబడి వెక్కిరిస్తూ పగ సాధిస్తున్నాడు.

అమాయకురాలయిన ఊర్మిళను పంపి, ఇంకో అను బంధం సృష్టించి, మరేదో నాటకానికి నాంది పలుకు తున్నాడు. అమాయకంగా వున్నట్టు నటించి తనకు ద్రోహం చెయ్యటానికి పథకం వేస్తున్నాడు. ఇతని బారినుండి తనకు రక్షణ లేదా? భాస్కరం మనిషికాదు, రాక్షసుడు.

లలిత కంటివెంట నీరుకారి బుగ్గల్ని తడిపేసింది. అన్నీ తన పిచ్చి ఆలోచనలుగాని, భాస్కరం తనను ఏమి చెయ్య గలడు? తనకు ఇప్పటికే జీవితంమీద యే ఆశా లేకుండా పోయింది. తను కావాలనుకుంటే యిప్పుడే చచ్చిపోగలదు. అంతా తన చేతుల్లోనే వుంది.

'రాత్రులు నిద్రపట్టడం లేదు' అంటే ఎన్నో జాగ్రత్తలు చెప్పి ఇచ్చారు డాక్టరుగారు. ఆ మాత్రలు ఒక అరడజను మింగి మంచినీళ్ళుతాగి పడుకుంటే తనకు నిద్రలోనే శాంతి. శాశ్వత శాంతి. ఈ ఒంటరితనం, గతస్మృతులు బాధలు, భాస్కరం తనను ఏమి చెయ్యగలరు?

ఇంతమంచి ఉపాయం చేతుల్లో వుండగా తనకీపిచ్చి ఆలోచన లెందుకు? నవ్వుకుంది పొడిగా. నిద్రమాత్రలపొట్లం తలగడక్రింద పెట్టి మంచినీళ్ళుతాగింది లలిత. పడుకునేముందు ఆ పని చేసెయ్యాలి. అప్పుడే తనకు శాంతి. దేన్ని ఆశించి తను మళ్ళీ లేచి తిరగాలి?

వాచీ చూసుకుంది లలిత. పదకొండు గంటలయింది. ఆఖరిసారిగా, ఆ ఉత్తరంలో చంద్రం ఏమివ్రాశాడో చూడాలనిపించింది. కవరు తీసి, చింపింది.

వుత్తరం చదువుతూ అలాగే వుండిపోయింది. చదివిందే మళ్ళీ మళ్ళీ చదివింది ఆశ్చర్యంతో. లైటార్పి పడుకోవటానికి ప్రయత్నించింది. ఇంత పొద్దు పోయినా నిద్రరాదు.

దూరంగా నక్కలు అరుస్తున్నాయి మబ్బులు తినేసిన వెన్నెలలో, మొహం వెలవెలపోయి, భోరుమని యేడిచింది రాత్రి.

భాస్కరం బావ ఏమి మనిషి! జరిగిన సంగతి మాట మాత్రం చెప్పటానికి అతనికి ఎందుకు అభ్యంతరం? ఇన్నాళ్ళనుంచీ వస్తూ వున్నాడు. సందర్భవశాత్తూ అయినా చెప్పవచ్చును గదా? హఠాత్తుగా, పరిచితమయిన అడుగుల సవ్వడి

విని, లేచి లైటు వేసింది లలిత. వెనుదిరిగి పోబోతున్నవాడల్లా వెనక్కు తిరిగాడు భాస్కరం.

"వేరే పని వుండి, ఇప్పటిదాకా హాస్పిటల్‌లోనే వుండి పోయాను. నీ గదిలో యింకా లైటు వెలుగుతూవుంటే చూసి పోదామని వచ్చాను" అన్నాడు సంజాయిషీ యిస్తున్నట్టు. అతనివంక జాలిగా చూసింది లలిత.

"రా! బావా!" అంది నోరు పెగుల్చుకుని. అతని కళ్ళు నిద్రలేమితనం సూచిస్తున్నాయి నీరసంగా. "ఊర్మిళ రావటం లేదు?" అంది లలిత ఏదో మాట్లాడాలి గదాఅని. అతను మాట్లాడలేదు.

"మాట్లాడవేం, బావా? పాపకీ నేనంటే అసహ్యమేసిందా?" అంది బాధగా లలిత.

"లేదు! దానికి ఒంట్లో బాగాలేదు. ఇప్పుడు నీకు పూర్తి స్వస్థత చిక్కిందనుకొంటాను. రేపో ఎల్లుండో డిశ్చార్జి చేస్తారు" అన్నాడు.

"విశాలని ఒక్కసారీ తీసుకు రాలేదేం, బావా? ఆవిడ రాసిందా? లేక నీకే ఇష్టంలేదా, మేమిద్దరం మాటాడుకోవటం? ఇంతకాలంనుంచీ నేను ఇక్కడపడి ఉన్నానుగదా. ఒకసారి వచ్చి వెళ్ళటానికయినా తీరిక దొరకలేదా తనకి?" నిష్ఠురంగా అంది.

కొన్ని కారణాలవలన తను రాలేకపోయింది. ఆ విషయం నీకు తరవాత చెబుతాను. డిస్చార్జి అయిన తరవాత, కొన్నాళ్ళపాటు మే కాశ్మీరో వెళ్ళివస్తే బావుంటుందేమో? ఏమాలోచిస్తున్నావు?" అన్నాడు మాట మారుస్తూ.

"ఒంటరిదాన్ని నేను అవన్నీ ఎలా తిరగగలను. కొన్నాళ్ళు ఇక్కడేఉండి వెడదామనుకుంటున్నాను. నాలుగు రోజులపాటు నాకాశ్రయమివ్వలేవా. విశాల యేమయినా అంటుందని భయమా" పరిశీలనగా అతనిమొహంచూస్తూ అంది లలిత.

బాధగా మొహంపెట్టి కాస్సేపు మౌనంగా ఉండి పోయాడు భాస్కరం. "లేదు, లలితా! నువ్వు కొన్నాళ్లు ఇక్కడ వుంటానని నిజంగా అంటే నాకంటే సంతోషించే వాళ్లు ఉండరు. విశాల హృదయపూర్వకంగా స్వాగతమిస్తుంది నీకు." తొట్రుపడుతూ మాటలు నిలదొక్కుకుంటూ అన్నాడు.

లలితకు ఉవ్వెత్తున కోపం పొంగివచ్చింది. రోషంతో ముక్కుపుటాలదిరేయి.

"నువ్వు అబద్ధాలు ఆడతావని నాకు యింతవరకూ తెలియదు. నిన్ను నువ్వు వంచించుకుంటూ నన్నూ ఎందుకు వంచించటానికి ప్రయత్నిస్తావు? ఎవరిని మోసంచేద్దామని?" అని మెదురుగా ఆ ఉత్తరం అతని కిచ్చింది, "చంద్రంబావ వ్రాశాడు" అని గొణుగుతూ.

తీసుకుని అతను చదివాడు. లలిత మొహంలోకే చూస్తూ వున్న లలిత కన్నుల్లో నీరు తిరిగింది, లలితమీాద అమితంగా జాలిపడింది లలిత.

"లలితా! నేను మళ్ళీవచ్చి నిన్ను చూద్దామని అనుకున్నాను. కాని ఈ బాదరబందీలో వీలుకాలేదు. కాని

ఇక్కడ నన్నాశ్చర్యంలో ముంచివేసే సంగతి ఒకటి తెలిసింది.

ఇక్కడ ఒకాయన తటస్థపడి పరిచయమయ్యాడు. మాటలమధ్య, అతను భాస్కరానికి స్నేహితుడని తెలిసింది. కొంతకాలం క్రితంవరకూ ఇద్దరూ ఒకచోటే పనిచేస్తూ ఉండేవారట!

ఈ విషయం నాకు భాస్కరం ఎందుకు చెప్పలేదో అర్థంకావటంలేదు. మొన్నకూడా వచ్చివెళ్ళానుగదా?

నాలుగేళ్ళక్రితం విశాల మగపిల్లవాడిని ప్రసవించి చనిపోయిందట. తరవాత ఆ బిడ్డకూడా పోయిందట. ఎంత ప్రయత్నించినా నాకు నమ్మబుద్ధికావటంలేదు

కాని అవతల ఈ విషయం చెబుతున్నది ఒక పెద్ద మనిషి. వీలయినంత త్వరలోవచ్చి తమ్ముడిని. చూడాలని ఉంది. నువ్వు ఎప్పుడు డిశ్చార్జి అవుతున్నావు?

ఇట్లు

చంద్రం."

ఉత్తరం చదివి దీర్ఘంగా నిట్టూర్చాడు భాస్కరం.

"నిజమేనా బావా?" గద్గదకంఠంతో అంది లలిత.

"పసిపిల్లవాడివంటి మనస్సు అన్నయ్యది. గాభరా మనిషి. నువ్వు అసలే కష్టంలో వున్నావు. చెప్పటానికి ఇది నలుగురూ విని ఆనందంపంచుకునే విషయం కాదుగదా? ఊరుకున్నాను, నిదానంగా చెప్పవచ్చునీ, తను పోయింది. ఎంతో ప్రయత్నించాను. కాని విశాలని దక్కించుకోలేకపోయాను." భాస్కరం గొంతు బొంగురుపోయింది.

లలిత మౌనంగా ఉండిపోయింది. మనస్సులో ఏదో ఆలోచనలు సుళ్లుతిరుగుతున్నాయి మౌనంగా కాలం పరుగెత్తింది. పదకొండున్నరయింది. "లలితా! నిద్రపో! మళ్ళీ నేను వెళ్ళాలి. ఎల్లుండి వస్తాను. ఉదయమే అన్నీ సర్దుకుని ఉండు" అని వెళ్ళిపోయాడు లైటార్పేసి భాస్కరం.

చాలాసేపటివరకూ ఆలోచిస్తూ పడుకుంది లలిత. ప్రయత్నించినా నిద్రరాలేదు పాపం! విశాల పోయిందా? బావకు ఎంత కష్టంవచ్చింది! ఈ మనిషినిగురించేనా తను భయపడింది? బావ చిక్కిపోవటానికి కారణం యిదే అయి వుంటుంది. అంత బాధతో వున్న అతన్ని తను ఎంతవిపరీతంగా ద్వేషించింది? "నేను వట్టి పిచ్చిమనిషిని" అని గొణిగింది లలిత.

రాత్రి బద్ధకంగా దొర్లిపోయింది వెనుక పండుగ తిరుముంగిసి వస్తుండగా, ఆ రోజే దీపావళి. నల్లటిరాత్రి. వీధుల్లోనుంచి చీకటి చెల్లాచెదురవుతూంది. ఊరంతా సందడిగావుంది. మందుగుండు సామాను పెద్ద పెద్ద శబ్దాలతో పేలుతున్నది. వెలుతురుకు భ్రమసి పురుగులు సమీపించి కాలి మసిఅయి రాలిపోతున్నాయి.

వరండా చీకట్లో ఆలోచిస్తూ కూర్చున్నాడుభాస్కరం. వంటవాడు బయట దీనంగా చూస్తున్నాడు పిల్లలు ఆడుకుంటూంటే. ఇంటిముందు కారు ఆగినశబ్దం వినిపించింది. ఆశ్చర్యంతో బయటికి వచ్చాడు భాస్కరం. కారు తలుపులు తీసుకుని బయటికి వస్తున్న మనిషిని చూసి స్తంభించి అలాగే నిలబడిపోయాడు.

"అకేమిటి బావా, తెల్లబోయి చూస్తావు? ఎలా వచ్చాననా? కావాలనుకుంటే ఎట్లాగయినా రావచ్చు" అంది లలిత దగ్గరికివచ్చి. డ్రైవరు సామానుతీసి లోపల పెడుతున్నాడు. "నువ్వు రేపుకదా డిశ్చార్జి అయేది? నిన్ను తీసుకురావటానికి నేనే వద్దామనుకుంటున్నాను. డాక్టరుగారు ఒప్పుకున్నారా?" నీరసంగా అన్నాడు భాస్కరం.

"ఆఁ, ఒప్పుకోకేం చేస్తారు? అంతా అయిపోయిందిగా? పండుగనాడుకూడా – ఇంకా అక్కడే పడివుండటమేమిటనిపించింది. ఇవాళ ఊర్మిళ ఒక్కతీ అయిపోతుంది గదా? పసిపిల్ల! పాపం దానికేమి చాతవుతుంది? అన్న ఆలోచన వచ్చింది. ఇవాళే రావాలనిపించింది. పెద్దడాక్టరుగారి నడిగాను, సరేనన్నారు.

ఆ సంతోషంలో బజారుకిపోయి, మధ్యాహ్నంనుంచీ వచ్చి మందులుకొని రెడీమేడ్ షాపులో పాపకి బట్టలు తీసుకుని ఇప్పటికి బయటపడ్డాను. ఇవాళ ఆ మందులన్నీ నువ్వూ ఊర్మిళా కాలుస్తే నేను చూడాలి.

"అన్నట్టు పాప ఏదీ! లోపల ఉందా! ఊర్మిళా!" అంటూ లోపలికి దూసుకుపోయింది లలిత.

వంటవాడు లైటువేసి బావురు మని ఏడుస్తూ క్రింద కూర్చుండిపోయేడు.

"బావా! ఊర్మిళ యేదీ! బయటికి వెళ్ళిందా! ఒక్కదాన్ని ఎందుకు పంపించావు!" అంటూ వచ్చిన లలిత, దీనంగా ముఖంపెట్టి కుర్చీలో వాలిపోయిఉన్న భాస్కరాన్ని చూసి భయపడిపోయింది.

"మాట్లాడ వేమిటి, బావా? నాకు భయం వేస్తున్నది" అంటూ ఏడుపు మొహం పెట్టిన లలితకు వంటవాడు ఏడుస్తూ చెప్పాడు.

"బావగారికి వారంనుంచీ టైఫాయిడంట, ఆ జ్వరం. బొమ్మలాగా తిరుగుతూవుండే అమ్మాయిగారు అన్యాయంగా అట్లా పడిపోయారు. ఆ వారం రోజులూ అయ్యగారికి నిద్రా, తిండి లేవు. ఎంత మందికో చూపించారు. ఎన్నో చేశారు. ఎంతో బాధపడ్డాము. "అమ్మా...! నాన్నా... పిన్నీ" అని కలవరిస్తూ చిట్టితల్లి అన్యాయంచేసి పోయింది, మూడు రోజులకిందట, మమ్మల్నొదిలిపెట్టి." రెండు చేతులతో మొహం కప్పుకున్నాడు వంటవాడు.

పొంగి వచ్చే దుఃఖంతో రోదిస్తూ, కన్నీటితో ముఖం తడిసిపోతూ వుండగా భాస్కరం పాదాలవద్ద వెక్కుతూ కూలబడిపోయింది లలిత.

నిశ్శబ్దంగా యేడుస్తూ నడిచింది కాలం, కొన్ని నిమిషాలసేపు. భాస్కరం కన్నీరు తుడుచుకున్నాడు. "ఎంత పిచ్చివాడినై పోయాను నేను!" అని గొణుగుకున్నాడు.

"లలితా! మరీ చిన్న పిల్లవైపోతున్నావేం. పిచ్చిదానా! నన్ను ఓదార్చవలసిందిపోయి నువ్వే గుండెలు పగిలేటట్టు ఏడుస్తున్నావా.

"నీ ఆరోగ్యం అసలే బాగాలేదు. ఇట్లాగే బాధపడితే మళ్ళీ చెడుతుంది. లే."

అంతా అట్లా జరగాలని ఉంది కాబోలు! ఈ వారం

రోజులూ నేనూ యెంతో తాపత్రయపడ్డాను. బాధపడ్డాను. కాని, ఊర్మిళని రక్షించుకోలేకపోయాను. విరక్తిచెంది చచ్చిపోదామని ప్రయత్నించాను. చచ్చి ఏమి సాధించను? భగవంతుడు జన్మ ప్రసాదించింది బలవంతంగా చావడానికి కాదు గదా.

మన బ్రతుకులు మూణ్ణాళ్ళ ముచ్చటలే. ఇలాంటప్పుడే మనమెంత అల్పులమో తెలిసేది. అది తెలిసిన్నీ, తిరిగి మాయలో పడుతుంది మనస్సు. అంతలో నే ఎన్నో తాపత్రయాలుపడతాము. అందుకే మనుష్యులు అన్నారు మనల్ని" అంటూ బుజాలు పట్టుకుని లేవదీసి మంచం దగ్గరికి చేతుల మీద తీసుకెళ్ళాడు లలితను భాస్కరం.

ఎదురింటి గోడమీద దీపం కొడిగట్టి ఆరిపోబోయింది. అంతలోనే గాలికి కొడి రాలిపోయింది. దీపం మళ్ళీ నూనె పీల్చి వెలుగులు వెదజల్ల సాగింది.